కథా నిలయం
776
శ్రీకాకుళం

# నీడలేని దేవుడు

గోపాలరావు పాతికేళ్ళ తరువాత తిరిగి తన స్వగ్రామానికి వస్తున్నాడు. రైలుదిగి బేగ్ భుజాన వేసుకొని నడక ప్రారంభించాడు. ఒక మైలు నడవాలి. పంటకాలువ గట్టునే గోపాలరావు నడుస్తున్నాడు. ఊరి పరిసరాలు చాలా మారిపోయాయి. దారిలో చాలామంది ఎదురౌతున్నారు. ఎవరూ తనని గుర్తుపట్టటం లేదు. నిజానికి ఎదురైనవాళ్ళు ఎవరో తనకీ గుర్తులేదు.

నీరెండలవేళ, గాలి చల్లగా వీస్తోంది. పక్షులు గూళ్ళకి చేరుకుంటున్నాయి. గోపాలరావు ఊరుకి దగ్గరౌతున్నాడు. ఊరు చివర వున్న వేణుగోపాలస్వామి ఆలయం అల్లంతదూరాన కనపడుతోంది. ఊళ్ళోకి ఎవరు వెళ్ళాలన్నా ఆలయం ముందునుంచే వెళ్ళాలి. గోపాలరావు ఆలయాన్ని సమీపించాడు. తలఎత్తి ఆలయ శిఖరాన్ని పరిశీలనగా చూస్తూ, చూపులను క్రిందికి సారించాడు. ఆలయం రంగు మాసింది—నల్లగా వుంది—అక్కడక్కడ చిన్నచిన్న గడ్డిమొక్కలు, నాచుమొక్కలు పెరిగాయి.

తన తండ్రి విశ్వనాథంగారు కన్నుమూయగానే, గోపాలరావు తన యిరవయ్యోయేటే ఆ ఊరు వదలి వెళ్ళిపోయాడు. పువ్వులమ్మిన చోటే కట్టెలమ్మడం యిష్టంలేక, బ్రతుకు తెరువుకోసం అప్పట్లో అలా చేయక తప్పలేదు గోపాలరావుకి. అదృష్టం కలసొచ్చి, బాగుపడి తిరిగి తను పుట్టిన ఊరుకి తిరిగి వస్తున్నాడు. కాలం మారింది. కాలంతో పాటు

మనిషి_మనిషి వూహాలు భావాలు కూడా మారాయి. ఆలయం కూడా చాలా మారిపోయింది. ఇదివరకటి వైభవం, కళ, యిప్పుడు కనపడటం లేదు.

గోపాలరావు ఆలయ ద్వారాన్ని సమీపించగానే అనుకోకుండా నిలబడిపోయాడు. ఒక్కసారి లోపలికి తొంగి చూసాడు. ఒక్కడుగు ముందుకువేసి ఆలయ ప్రాంగణద్వారాన్ని దాటాడు.

"రండి బాబు లోపలికి" అన్నాడు మండపంలో స్తంభానికి ఆనుకొని కూర్చున్న ఓ వృద్ధుడు.

గోపాలరావు అతన్ని సమీపించాడు—పరిశీలనగా చూశాడు. ఆ వృద్ధుని గడ్డం బాగా బిరుసెక్కి తెల్లగా జనపనారలా వుంది. జుట్టూ, గడ్డం కలిసిపోయాయి. ముఖం సరిగ్గా ఆ చిట్టడవిలో కనబడ్డంలేదు. అతని కళ్ళు మాత్రం నూతిలోని నీళ్ళలా ఎక్కడో మెరుస్తున్నాయి. పండుటాకులా వున్నాడు మనిషి.

"ఎవరు బాబు మీరు?" అన్నాడా వృద్ధుడు నిశ్శబ్దాన్ని చీలుస్తూ. ఆ ప్రశ్నలో ఎంతో సౌమ్యత, ప్రశాంతత తొణికిసలాడాయి. సమాధానం చెప్పి వెళ్ళవలసినంత మృదువుగా వుంది అతని స్వరం.

"నేను విశ్వనాథంగా రబ్బాయిని- గోపాలరావుని తాతా" అన్నాడు గోపాలరావు.

"గోపాలం బాబా! చాలా కాలానికి కనుపించావు బాబు. యింక నిన్ను చూస్తానో_చూడకుండానే కన్నుమూస్తానో_అనుకున్నాను-యిలా దగ్గరికి రా బాబూ" అంటూ గోపాలరావుని దగ్గరికి తీసుకుని, వళ్ళంతా ఎంతో ఆప్యాయంగా నిమిరాడు.

గోపాలరావు మనసు పాతికేళ్ళ వెనక్కి పరుగెత్తింది. తన తండ్రి ఈ ఆలయాన్ని కట్టించారని ప్రజలు చెప్పుకోవటం-దీని నిర్మాణమంతా 'రామ బ్రహ్మం' అనే ఒక గొప్ప శిల్పిచేతిమీదుగా జరిగిందని అందరూ అనుకోవడం గోపాలరావుకి జ్ఞాపక మొచ్చాయి. తనకి

ఊహ వచ్చేకకూడ, తరచు రామబ్రహ్మం, నాన్నగారితో తిరగడం—
ఆలయం గురించి, వుత్సవాల గురించి మాట్లాడుకోవడం-అంతా ఒకదాని
తరువాత ఒకటి జ్ఞాపకమొచ్చాయి గోపాలానికి.

"అయితే యితను రామబ్రహ్మమే అయివుండాలి. సందేహంలేదు
యితను రామబ్రహ్మమే !" అని నిశ్చయించుకున్నాడు. పరిశీలనగా
చూశాడు. గుర్తుపట్టాడు.

"నీవు రామబ్రహ్మానివే కదూ తాతా?" అన్నాడు గోపాలరావు.

"అవును బాబు. నేను నిన్ను గుర్తు పట్టలేకపోయినా - నువ్వు
నన్ను గుర్తుపట్టావు-రా బాబు! స్వామిని చూద్దువుగాని" అని గోపాల
రావుని గర్భగుడిలోకి తీసుకువెళ్ళాడు రామబ్రహ్మం. పూజారికి గోపాల
రావుని చూపించి "మన విశ్వనాథం బాబుగారి అబ్బాయి — గోపాలం
బాబు" అన్నాడు.

పూజారి అగ్గగలాడుతూ, తీర్థ ప్రసాదాలిచ్చి, "మీరు తిరిగిఇన్నా
ళ్ళకి ఊళ్ళోకి రావడం-స్వామి దర్శనానికి రావడం-నాకు చాలా ఆనం
దంగా వుంది బాబు. ఆ మహాదాత యీ ఆలయాన్ని కట్టించారు. ఇప్పుడు
దీని విషయం పట్టించుకొనేవాళ్ళే లేరు బాబు" అంటూ పూజారి ఏదో
చెప్పుకుపోతున్నాడు.

"బాబు రేపు మళ్ళీ వస్తాడులే. యింకా యింటికైనా వెళ్ళలేదు.
చాలాకాలం తరువాత వచ్చాడా — యిల్లు శుభ్రం చేయించుకోవలసి
వుంటుంది" అంటూ గోపాలరావుని ముందుకు నడిపించాడు తాత.

"ప్రదక్షిణం చేసుకుని వెళ్ళు బాబు" అని చెప్పి గోపాలరావు
భుజాన్ని ఆసరాగా చేసుకుని తాను కూడా నడిచాడు రామబ్రహ్మం.

ఆలయానికి ఆగ్నేయ మూలకి వచ్చాక "చూశావా బాబు ! యీ
మూల కూలిపోయింది. ఎప్పుడో నాకు పాతికేళ్ళ వయస్సప్పుడు-అంటె
అరవై అయిదేళ్ళ క్రితం కట్టిన గుడి. దీనికి నాలాగే వయస్సు మళ్ళు
తోంది" అంటూ గోపాలరావుకి ఆలయాన్ని చూపించాడు రామబ్రహ్మం.

"త్వరలోనే బాగుచేయిద్దాం తాతా?" అన్నాడు గోపాలరావు. కూలి పోయిన భాగాన్ని పరిశీలనగా చూస్తూ.

"సంతోషం బాబు. పద-నేనూ నీతో వస్తాను. ఒక్కడివీ చాలా యేళ్ళ తరువాత ఇంటికి వెడుతున్నావు. యేం తంటాలు పడాలో పాపం" అని ఓ మూల నున్న కఱ్ఱ తీసుకున్నాడు రామబ్రహ్మం.

"వద్దులే తాతా! నువ్వు నడవలేవు. కూర్చో! సాయంకాలం నేను మళ్ళీ వస్తాను. వచ్చి ఇంటికి తీసుకుపోతాను" అని గోపాలరావు ఇంటి ముఖం పట్టాడు.

పుట్టిన ఊరుమీద మమకారం గోపాలరావుని ఆ ఊరు తీసుకు వచ్చింది. గోపాలరావు చాలాకాలం తరువాత, తాను పుట్టి, పెరిగిన ఇంటిని కళ్ళముందు చూడగానే- ఎంతోకాలం ఎడబాటు ననుభవించి, తిరిగి తల్లిని కలుసుకున్న పసివాడిలా అయిపోయాడు. కళ్ళు చెమ్మ గిల్లాయి. మనసులో ఏదో తీయని అనుభూతి రేగింది. మాటలకందని అనుభూతి అది.

అది పెద్ద పెంకుటిల్లు. తాళం తీస్తూవుంటే చుట్టు ప్రక్కల వాళ్ళు చేరారు. విశ్వనాథంగారి అబ్బాయి వచ్చాడని ఊరంతా ఇట్టే పాకిపో యింది. జనం వస్తున్నారు. విశ్వనాథంగారిమీద అభిమానంకొద్ది వచ్చే వాళ్ళు కొందరు, ఆయన మీదున్న గౌరవం కొద్ది వచ్చేవాళ్ళు కొందరు, ఇల్లు అమ్ముకుపోవడానికి వచ్చాడేమో తెలుసుకుందామని వచ్చేవాళ్ళు కొందరు-రకరకాల మనసులతో, రకరకాల జనం వచ్చారు. మునసుబు, కరణం కూడ వచ్చారు. గోపాలరావుని పలకరించారు.

పాతికేళ్ళ తరువాత తాళం తీయడంతో ఇల్లంతా దుమ్ముపట్టి వుంది. ఇద్దరు పని మనుషుల్ని పిలిపించి ఇల్లంతా శుభ్రం చేయించారు మునసుబు కరణాలిద్దరూ దగ్గరుండి. కరణంగారు, గోపాలరావుని భోజ నానికి రమ్మని దగ్గరుండి తీసుకెళ్ళారు.

గోపాలరావు తల వంచుకొని భోజనం చేసున్నాడు. కొంతసేపు కరణంగారు, గోపాలరావు అంతగా మాట్లాడుకోలేదు. ఆకలి బిగి తగిన తరువాత, "ఇప్పుడు పట్నంలో నువ్వు చేసే పనేమిటయ్యా?" అన్నాడు కరణంగారు మామూలు ధోరణిలో.

"ముఖ్యంగా చెప్పుకోవలసింది ఇనుప వ్యాపారమే అనుకోండి. ఈ మధ్యనే ఒక సినిమాహాలు అయిదేళ్ళకు అద్దెకు తీసుకున్నాను" అన్నాడు గోపాలరావు.

"అయితే నువ్వు ఇక్కడ వుండడం కుదరదన్నమాట ?"

"ఇక్కడ వుందామనె వచ్చాను. పిల్లల్ని త్వరలోనే తీసుకు రావాలి?"

"మరక్కడి వ్యాపారం!"

"పెద్దబ్బాయి చూసుకుంటాడు?"

"అంతటి కొడుకక్కడ వున్నాడన్నమాట. ఇంకేం?"

"ఏదో ఆ వేణుగోపాలస్వామి దయవల్ల" అన్నాడు గోపాలరావు.

కథ కరణంగారి ఊహకి అడ్డం తిరిగింది. గోపాలరావు వూరు వదలిపోతాడేమో, ఆ ఇల్లు తన కొడుక్కి కొందామని అనుకున్నాడు. అందుకనే పిట్టని గుప్పెట దాటి పోనీయడం మంచిదికాదని, అతన్ని భోజనానికి కూడ పిలిచాడు కరణంగారు. ఇంక ఇప్పుడతనితో అంత అవుసరం యేం కనిపించలేదు కరణంగారికి. అందుకే "మరి పిల్లలువచ్చే దాకా నీ భోజనం సంగతి..." అని యింకాయేదో చెప్పబోయాడు కరణంగారు.

"ఫరవాలేదండి నేను వండుకుంటాను" అన్నాడు గోపాలరావు.

"ఎందుకయ్యా, నేను వంట మనిషిని పంపుతానులే" అన్నాడు కరణంగారు మనసులో ఈ అనవసరపు బెడద తప్పిందనుకుంటూ.

గోపాలరావు ఇంటికి వచ్చి, వళ్ళంతా బడలికగా వుండడంచేత పెందరాళే నడుం వాల్చాడు. "తాను రాగానే చుట్టుపక్కల జనం అంతా రావడం-మునసుబుగారు, కరణంగారు కూడా రావడం-వాళ్ళంతా దగ్గరుండి ఇల్లు శుభ్రం చేయించడం-కరణంగారు స్వయంగా దగ్గరుండి ఇంటికి భోజనానికి తీసుకెళ్ళడం-ఇదంతా గోపాలరావుకి చాలా సంతోషంగా వుంది. నిజానికి తనని వాళ్ళెవరూ అంతగా ఎరుగరు. తాను విశ్వనాథంగారి కొడుకుగానే వాళ్ళకి పరిచయం. అందుకే తనంటే వాళ్ళకంత అభిమానం, ఆదరణ. వాళ్ళంతా ఎంత మంచివాళ్లో అనుకున్నాడు గోపాలరావు మనుషుల మనసులు అర్థంగాక. 'నీ తరువాత నీ కొడుకొస్తే ఇలా ఆదరిస్తారా వీళ్ళంతా' అంది అతని మనసు.

'నేనేం ఘనకార్యాలు చేశానని? నాన్నగారు వాళ్ళ హృదయాల్లో అంతగా పాతుకుపోయారు గాబట్టి నన్ను వీళ్ళంతా ఇంతగా ఆదరించారు' అని సమాధానం చెప్పుకొని తండ్రిని తలుచుకొని నిద్రపోయాడు గోపాలరావు.

మరునాటి సాయంత్రం గోపాలరావు ఆలయానికివచ్చాడు. అతని రాక కోసం అప్పటికే, రామబ్రహ్మం వేయికళ్ళతో ఎదురు చూస్తున్నాడు. గోపాలరావు రాగానే ఒక్కక్షణం పరిశీలనగా చూశాడు రామబ్రహ్మం.

"ఏమిటి తాతా? అలా చూస్తున్నావ్?" అన్నాడు గోపాలరావు.

"ఏం లేదు బాబు నిన్ను చూస్తూ వుంటే - విశ్వనాథం బాబుని చూస్తూ వున్నట్టే వుంది?"

"అదంతా నాన్నగారిమీద నీకున్న అభిమానం తాత."

"నిజమే బాబు. మా తనువులు పోయినా తరగని అభిమానం మాది. నన్ను వదలి, ఆయన ముందుగా వెళ్ళిపోయాడు. అసమర్థుడైన నాకు-ఈ స్వామిని వప్పగించాడు" అని వేణుగోపాలస్వామిని చూపించాడు రామబ్రహ్మం.

ఇద్దరూ మండపంలో కూర్చున్నారు. గోపాలరావు చుట్టూ పరిశీలనగా చూశాడు. ఓ మూలగా తెల్లగన్నేరు చెట్టు విరగబూసింది. కొన్ని పూలు కింద రాలిపడి నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. ఈశాన్యమూల గిలక బావి వుంది. స్వామి దర్శనానికి వచ్చినవాళ్ళు అక్కడ కాళ్ళుకడుక్కొని ఆలయంలోకి వెడతారు. మరోపక్క పెద్ద వృక్షంలా పెరిగిపోయిన మందార మొక్క — ఓ మూలగా సన్నజాజి పందిరి, సూతిచుట్టూ అరటి చెట్లు, — అక్కడక్కడ నీలగోరింట మొక్కలు, కనకాంబర మొక్కలు — పక్కగా ఓ దానిమ్మచెట్టు — బాగా ఎత్తుగా పెరిగిన ఆరు కొబ్బరిచెట్లు, ఓ పెద్ద మల్లెపందిరి — అంతా ఓ చిన్న ఉద్యానవనంలా అనిపించింది గోపాలరావుకి. ఎంతో చూడముచ్చటగా వుంది. గాలిలో సువాసనలు తేలుతున్నాయి. అప్పుడప్పుడు స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయంలో గంటని మోగిస్తున్నారు. ఆ ప్రశాంత, నిశ్శబ్ద వాతావరణం గోపాలరావుకి ఎంతగానో నచ్చింది. ఎవరికైనా ఆ వాతావరణం ఆహ్లాదంగానే వుంటుంది. గోపాలరావు తన్నుతాను మరచిపోయి ఆ అందాన్నంతా చూస్తూ వుండిపోయాడు.

"ఏమిటి బాబు అలా చూస్తున్నావు ?" అన్నాడు రామబ్రహ్మం.

"ఈ తోట — ఈ వాతావరణం చూడు తాత ! ఎంత అందంగా వుందో ? యిక్కడ కూర్చుంటే మనిషి అన్నిబాధలూ మరచిపోతాడు" అన్నాడు గోపాలం.

"నిన్న నువ్వు వచ్చేదాకా — యీ అందం ఆట్టేకాలం వుంటుందన్న నమ్మకం నాకు లేదు బాబు !"

"అదేమిటి తాత ?"

"ఏముంది బాబు ! మనిషిలో అహం, ద్వేషం బాగా పెరిగిపోయాయి యీ రోజుల్లో... మంచీ చెడ్డా, ఆలోచించే శక్తి మనిషిలో నశించిపోయింది బాబు."

"అసలు ఏమైంది తాత ?" అన్నాడు గోపాలరావు, రామబ్రహ్మం మనసును ఎవరో బాగా నొప్పించారని గ్రహించి.

"మొన్న మునసబుగారి ఆవు వచ్చి, పూల మొక్కలు పాడు చేసింది. ఆవును గట్టిగా కట్టించండని కబురు చేశాను. ఆ మాటమీద ఆయన నాకో కబురుచేసి,—

"అనవసరపు విషయాల్లో జోక్యం కలిగించుకుంటే ఆ వున్న నీడ కూడ వుండదు, జాగ్రత్త. ఆలయం నీ సొత్తేం కాదు" అని నన్ను మందలించారు. ఆ మొక్కల్ని పసిపిల్లలకన్న గారాబంగా పెంచుకున్నాను గాబట్టి బాధకొద్దీ అలా అన్నాను. లేకపోతే నే ననేవాడినే కాదు బాబు" అన్నాడు రామబ్రహ్మం ఎంతో బాధగా.

"నువ్వన్నమాటలో తప్పేముంది తాతా ? ఆయనంత కటువుగా మాట్లాడటానికి ?"

"తప్పు నాకూ తెలియలేదు బాబు. కాని, అదేరోజున అయిదారుగురు గడుగ్గాయలొచ్చి, మండపంలో పేకాట ప్రారంభించారు. రంగన్న వచ్చి, 'గుళ్లో ఓమూల సారాబట్టీ పెడతాను రాత్రికి' అన్నాడు. ఈ విధంగా మునసబుగారు నామీద కోపాన్ని స్వామిమీద తీర్చుకుంటున్నాడనుకున్నాను. నేను కన్నుమూసినా — నేను వీళ్ళ అత్యాచారాలని సహించలేక ఈ ఆలయాన్ని వదలిపోయినా, యీ నోరులేని దేవుడు ఏమైపోతాడో నని నామనసు పరిపరివిధాల పోయింది. నువ్వు నిన్న వచ్చాక ఈవేళ వాళ్ళెవరూ ఈ ఛాయలకి రాలేదు బాబు. నా మనసు ఈవేళ చాలా తేలికగా వుంది బాబు" అన్నాడు రామబ్రహ్మం బరువుగా నిట్టూర్చి.

"నాన్నగారి వెనకాల చేతులుకట్టుకు తిరిగి, నీ కనుసన్నలలో బ్రతికిన మునసబు అంతవాడయ్యాడా తాతా ?"

"కాలాలు మారిపోయాయి బాబు" అన్నాడు రామబ్రహ్మం నవ్వుతూ.

"అందుకే ఈ ఆలయం పరిస్థితి యిల్లావుంది తాతా!" అన్నాడు గోపాలరావు.

"అసలు ఈ ఆలయ శోభ, వైభవం నీకుకూడ పూర్తిగా తెలీదు బాబు. నీకు ఊహ తెలిసేసరికి—నాన్నగారిచేతిలో డబ్బూ తగ్గింది—ఆలయ వైభవమూ తగ్గింది. ఈ ఆలయచరిత్ర అంటే — నాన్నగారి చరిత్రే బాబూ" అని గోపాలరావు ముఖంలోకి చూశాడు రామబ్రహ్మం.

"అలాగా?" అన్నాడు గోపాలరావు.

"ఔను బాబు. నాన్నగారు అప్పట్లో ఈ వూరికి ఓ పిల్లజమీందారులా వుండేవారు. నా ఇరవైఅయిదవయేట నాన్నగారితో పరిచయమయ్యింది. నన్నీవూరు తీసుకొచ్చారు. నా ప్రేరణమీదనే — ఆయన ఈ ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. నేనొక సాధారణ శిల్పినే అయినా — నా యిష్టంవచ్చిన తీరుగా, నా చేతిమీదుగా ఈ ఆలయ నిర్మాణం జరిగింది. నా మాట ఆయనెన్నడూ కాదనలేదు. ధాన్యం బస్తా రెండు రూపాయలమ్మే రోజుల్లో ఈ ఆలయంకోసం ఇరవై వేల రూపాయలు అయ్యింది. నాన్నగారు ఒక్క రూ—వెనకాడకుండా ఖర్చుపెట్టారు. నిర్మాణం పూర్తికావటానికి మూడేళ్ళు పట్టింది. ఆ కొబ్బరిచెట్లు నాన్నగారు స్వయంగా నాటినవే బాబు.

ప్రత్యేకంగా స్వామివారి విగ్రహం చెక్కడానికి ఒక సంవత్సరం పట్టింది. నల్ల పాలరాయి తెప్పించి, ఆ నీలమేఘ శ్యాముణ్ని, నా చేతులతో మలచాను బాబు. ఇటురా: చూడు బాబు, ఆ వేణువుమీద మూడు వేళ్ళను ఆన్చి, — చిటికెనవేలు నిటారుగా వుండేటట్లు చెక్కడానికి— రెండురోజులు పట్టింది. అది ఎక్కడ చిట్లిపోతుందోనని ఊపిరి బిగపట్టి పనిచేశాను. ఆ పింఛం చెక్కడానికి ఎంతో సున్నితంగా, జాగ్రత్తగా పనిచెయ్యవలసి వచ్చింది—నా మనసులో ముద్రించుకున్న ఆ స్వామి రూపాన్ని ఈ రాయిమీద మలిచాను. ఆ స్వామిలోని ప్రతి అణువును— నేను తాకి, తడిమి, చుంబించి—చివరికి ఆ రూపాన్ని అలా ప్రతిష్ఠించుకున్నాను బాబు. ఆ పెదవులపై చిరునగవు రావడానికి గంటలతరబడి

ఆలోచించి, వివిధ భంగిమలలో స్వామిని చూసి చూసి, చివరికి ఈ రూపాన్ని దిద్దగలిగాను. నా శిల్పచాతుర్యానికి చిహ్నంగా ఈ మోహనా కారుణ్ని చిత్రించుకున్నాను. ఈ అరవై అయిదేళ్ళబట్టి స్వామిని చూస్తూనేవున్నా— నేటికీ నాకు కొత్తగానే కనబడతాడు. ఎన్నిసార్లు చూసినా, ఎంతసేపు చూసినా నాకు తనివితీరదు బాబు. కన్నుమూసినా, కన్నుతెరచినా, ఆ దివ్యమంగళమూర్తి నా కళ్ళముందుంటాడు. ఆలయ నిర్మాణం పూర్తయిన పదేళ్ళదాకా — స్వామి అనుభవించిన వైభవం యింతా అంతా కాదు. నాన్నగారు, స్వామివిషయంలో డబ్బును మంచి నీళ్ళలా ఖర్చుపెట్టారు. నిత్య సంతర్పణలు_సమారాధనలు _ భోగాలు _ ప్రసాదాలు—అంతుండేదికాదు బాబు.

ఏటా కృష్ణాష్టమికి—గొల్లవేషాలు, భామవేషాలు, హరికథలు _ భజనలు _ మేజువాణీలు _ స్వామికి పన్నీటి స్నానాలు, పునుగు, జవ్వాజి ధూమాలు—ఆ భోగానికి అంతులేదు. స్వామి తన ద్వారకలో కూడ అంతభోగం అనుభవించి వుండడు బాబు.

రానురాను నాన్నగారిచేతిలో డబ్బూ తగ్గిపోయింది — స్వామి వైభవమూ సన్నగిలి పోయింది" అన్నాడు రామబ్రహ్మం ఎంతో ఆవేశంతో.

"నువ్వు లేకపోతే ఈ వేణుగోపాలు డెక్కడ? వేణుగోపాలుడు నీలోనే కనబడుతున్నాడు నాకు" అనుకొన్నాడు గోపాలరావు తాతని కన్నార్పకుండా చూస్తూ.

"ఇటు రా బాబు" అంటూ గోపాలరావుని ఆలయ ఆగ్నేయ భాగానికి తీసుకెళ్ళి _ 'ఇది త్వరగా బాగుచేయించకపోతే స్వామికి నీడ లేకుండా పోతుంది బాబు' అని మళ్ళీ గుర్తుచేశాడు రామబ్రహ్మం.

"త్వరలోనే తప్పకుండా బాగుచేయిద్దాం తాతా" అన్నాడు గోపాలరావు దృఢ నిశ్చయంతో.

ఇంతలో 'అబ్బా' అంటూ రామబ్రహ్మం తన కుడిభుజాన్ని గట్టిగా నొక్కిపట్టుకున్నాడు.

"ఏమైంది తాతా?" అన్నాడు గోపాలరావు కంగారుగా. 'ఏమీ లేదు బాబు. మేహవాతాన్ని అప్పుడప్పుడు కుడిభుజంలో పోటు వచ్చి వారంరోజులపాటు ఈ చెయ్యి అసలు పనిచెయ్యదు బాబు' అన్నాడు రామబ్రహ్మం బాధగా.

"అలా మండపంలోకెళ్ళి కూర్చుందాం రా తాతా!" అంటూ రామబ్రహ్మాన్ని పట్టుకొని మండపంలోకి తీసుకెళ్ళి కూర్చోపెట్టి, 'నువ్వొక్కడివీ యిక్కడేముంటావు? ఇల్లంతా ఖాళీయేగా, యింటికి పోదాం, రా తాతా!' అన్నాడు గోపాలరావు.

"నేను ఒంటరివాడి నేమిటి బాబు? వేణుగోపాలుడు లేడూ-నాకు తోడుగా. ఆ స్వామిని విడిచి ఒక్కక్షణం వుండలేను బాబు."

"ఇక్కడ భోజనం—అదీ"

"యిన్నాళ్ళు ఆ స్వామి ప్రసాదం తినే బ్రతికాను-ఆయన నీడనే విశ్రమించాను-ఇదే నా ఇల్లు బాబు — యిదే నా సర్వస్వం. ఇది వదిలి ఎక్కడికీ రాలేను బాబు. పొద్దుపోయింది. నువ్వు వెళ్ళిరా" అన్నాడు రామబ్రహ్మం.

రామబ్రహ్మాన్ని పడుకోబెట్టి, కంబళి కప్పి యింటికి వచ్చాడు గోపాలరావు.

రోజు రోజుకీ రామబ్రహ్మం వ్యాధి ముదురుతూ వచ్చింది. లేవలేక పోతున్నాడు. తిండికూడ తినడం మానేశాడు. డాక్టరు మందులు యిస్తూనే వున్నాడు. కాని రోగం మళ్ళ ముఖం పట్టలేదు. గోపాలరావు తరచు రామబ్రహ్మం దగ్గరే వుంటున్నాడు. మునసుబు, కరణం, ప్రెసిడెంటు-పెద్దలు ఆలయం దగరకి రోజూ వస్తున్నారు, అది రామబ్రహ్మం మీది భక్తికాదు. గోపాలరావు దగ్గిరున్న తీపిని చూసి చేరిన చీమలవన్నీ.

వో నాటి సాయంత్రం— ఆకాశమంతా కారు మబ్బుతో నిండి పోయింది. పెద్దగా ఉరుములు-మెరుపులు-గాలికి చెట్లు వూగిపోతూ విషాద గీతాలు పాడుతున్నాయి. రామబ్రహ్మం పరిస్థితి ఏమి బాగాలేదు. డాక్టరు లాభం లేదన్నాడు. ఇంక గంటల్లో వుందన్నాడు.

"ఒక శిల్పి-ఒక గొప్ప కళా తపస్వి.

ఓ తపస్వి-తన సర్వస్వాన్ని వదిలి వెళ్ళిపోతున్నాడు" అనుకున్నాడు గోపాలరావు.

ఆలయంలోని దీపం రెపరెప లాడుతోంది గాలికి, కూలిపోయిన భాగంనుంచి వానదేవుడు వేణుగోపాలుడికి అభిషేకం చేసున్నాడు. రామబ్రహ్మం వణుకుతున్నాడు. అతని తలకూడ వణుకుతోంది. తల దగ్గర గోపాలరావు కూర్చున్నాడు.

పెద్దలంతా చేరారు. రకరకాల పెద్దలు- కానీయేనా లాభంలేనిదే ఏ విషయంలోనూ కాలుపెట్టని కరణంగారు-"తన్నెదిరించి ఈఊళ్ళో బ్రతకడం ఎవడితరం?" అన్న అహంతో ఊగిపోయే మునసుబు-ఇంక మండపంలో స్వేచ్ఛగా పేకాడుకోవచ్చను కుంటూన్న జులాయి మేళం-ఏదో మూల సారాబట్టీ హాయిగా పెట్టుకోవచ్చునుకునే రంగన్న—"శిల్పి రామబ్రహ్మం అంత్యక్రియలకి నేనధ్యక్షత వహించానని-పేపర్లో వేయించుకో వచ్చ"న్న ఆశతో ప్రెసిడెంటు-ఇంకా జనం - రకరకాల జనం-వింత చూసే జనం-అంతా వచ్చారు-అక్కడ అందరూ పెద్దలే.

గాలి విపరీతమయింది. గుళ్ళో దీపం నిలవలేక పోతోంది. వేణుగోపాలస్వామి చీకటి వెలుగుల మధ్య దోబూచులాడుతున్నాడు.

మునసుబుని కరణం పక్కకి పిలిచారు.

"యిక లాభం లేదు మునసుబు" అన్నాడు కరణంగారు.

"మరేం చేద్దాం?" అన్నాడు మునసుబు.

"గుడి మైలపడి పోకుండా కాపాడుకోవడం మంచిది" అన్నాడు కరణం.

"సరే అయితే. ఇక ఆలస్యమెందుకు" అని గోపాలరావు దగ్గర కెళ్ళి "యింక లాభం లేదండి గోపాలరావుగారు, గుడి మైలపడిపోకుండా మండపంలోంచి బయటపెట్టడం మంచిది"

"వానలో పెడదామా?" అన్నాడు గోపాలరావు అయిష్టంగా.

"దానిదేముంది? పోయేవాడికి ఎండా, వాన ఏముందయ్యా" అన్నాడు కరణం.

రామబ్రహ్మం చెవిని ఈ మాటలు సూచాయగా పడ్డాయి. కాళ్ళు ఒకళ్ళు, చేతు లొకళ్ళు పట్టుకొని పైకెత్తారు.

రామబ్రహ్మం మనసు మూలిగింది!

"స్వామి! నా చేతులతో నిన్ను సృజించి వులితో చుంబించి, నీలోని ప్రతి అణువును తాకి నిన్ను చిత్రించుకున్నాను. గుడికట్టి నీకు నీడ నిచ్చాను. చివరికి నాకు నీడలేకుండా చేస్తున్నావా—పోనీలే స్వామి. నా వల్ల నీవు మైలపడకు" అనుకున్నాడు మనసులో.

రామబ్రహ్మాన్ని వానలో పెట్టారు—ఎవరు?

ఆలయాన్ని కట్టించినవాళ్ళు కారు.

వాళ్ళ వారసులు కారు.

కట్టినవాళ్ళు కారు—పెద్దలు—గ్రామ పెద్దలు—దేవుడిపెద్దలు.

ఆకాశం కెవ్వున అరచింది—పెద్ద మెరుపు మెరిసింది.

కొబ్బరిచెట్టు ఫెళఫెళ విరిగి ఆలయం మీద పడింది.

"నీకులేని నీడ నాకూ వద్దన్నాడు" వేణుగోపాలుడు.

గుడి కూలిపోయింది.

దేవుడు తడుస్తున్నాడు.

దీపం ఆరిపోయింది.